

కర్ణాటక మద్యం సీజ్
కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న పలువురి నిందితులను చిత్తూరు జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. - 8లో



గంట వ్యవధిలో అప్పగింత
పలమనేరులో ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయిన పిల్లలను పోలీసులు గంట వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించారు. - 8లో



పదిటన్నుల కూరగాయల వితరణ
పలమనేరుకు చెందిన శ్రీవారి భక్తులు రథసప్తమి సందర్భంగా తిరుమలకు పది టన్నుల కూరగాయలను వితరణ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

సీఎం సభా స్థలం ఖరారు



నేతలతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్

శాంతిపురం: హంద్రీ–నీవా కుప్పం కాలువ ప్రారంభం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పర్యటించే ప్రాంతాలను అధికారులు ఖరారు చేశారు. రామకుప్పం, శాంతిపురం మండలాల్లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ నేతృత్వంలో అధికారులు ఇటీవల పలుచోట్ల పరిశీలించారు. ఎట్టకేలకు శాంతిపురం మండలంలోని గుండిశెట్టిపల్లి వద్ద హంద్రీనీవా కాలువ పక్కనే హెలీప్యాడ్ ఏర్పాటు, మఠం సమీపంలో బహిరంగ సభ నిర్వహణకు నిర్ణయించారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ భరత్ గురువారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. పార్కింగ్ సహా ఇతర అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 26న సీఎం కుప్పం పర్యటన ఖరారయ్యే అవకాశం ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు, రెస్కో ౖచెర్మన్ సెంథిల్‌కుమార్, వైస్ ౖచెర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు విజలాపురం బాబురెడ్డి, విజయకుమార్, స్థానిక సర్పంచ్ మురళి పాల్గొన్నారు.

పెన్షనర్ల వైద్యానికి ఆదేశాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పెన్షనర్ల వైద్య చికిత్సలకు అధికారులు ఆదేశాలు ఇచ్చారని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కేశవులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండె, కిడ్నీ, నరాల సమస్యలతో బాధపడే పెన్షనర్లు గతంలో తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు, చెన్నైలోని అపోలో, విజయా, కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు ఆస్పత్రులకు వెళ్లేవారన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని 33 ఏళ్లపాటు అపోలో యాజమాన్యం లీజుకు తీసుకోవడంతో ఇక్కడే పెన్షనర్లకు అన్ని వ్యాధులకు ఉచిత చికిత్స చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి కరుణకుమార్, డీఆర్‌డీఈ పీడీ తులసి అపోలో యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. హెల్త్‌కార్డులతో చికిత్సకు వెళ్లే పెన్షనర్లకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పింక్ కార్డు ఇస్తారని, ఏమైనా సందేహాలు ఉంటే 9866857089 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కమిటీ నియామకం

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పలు విభాగాల కమిటీ సభ్యులను నియమించారు. రాష్ట్ర న్యాయ విభాగ కమిటీ ఉపాధ్యక్షులుగా బీ.నరహరిరెడ్డి(తిరుపతి), ప్రధాన కార్యదర్శిగా జీఎస్‌కే.విజయభాస్కర్‌రెడ్డి(తిరుపతి), కార్యదర్శులుగా ఐ.చంద్రశేఖర్‌రెడ్డి(తిరుపతి), కేఎస్.రవీంద్రన్(చిత్తూరు), జాయింట్ సెక్రటరీలుగా వీ.శ్రీనివాసులు(తిరుపతి), సీ.విశ్వనాథరెడ్డి(చిత్తూరు) నియమితులయ్యారు. అలాగే ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శిగా గూడూరు మార్కొండయ్య(చిత్తూరు), కార్యదర్శిగా బీ.చిన్నరాజునాయక్(చిత్తూరు), పీ.రోహిత్‌సాయి(తిరుపతి), జాయింట్ సెక్రటరీలుగా హరిప్రసాద్‌నాయక్(తిరుపతి), కావడి నాగరాజు(చిత్తూరు), వైఎస్సార్‌సేవాదళ్ కమిటీ జాయింట్ కార్యదర్శిగా తోటి వెంకటరత్నం(చిత్తూరు) నియమితులయ్యారు.

ఖోఖో జిల్లా జట్ల ఎంపిక రేపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో ఈ నెల 17న ఖోఖో జిల్లా సీనియర్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఖోఖో అసోషియేషన్ సెక్రటరీ శరత్‌బాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి 26 వరకు తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు. ఆ పోటీలకు జిల్లా తరఫున పాల్గొనేందుకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో అర్హత సాధించే వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 8639389796, 7989166074 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.





మినీ బ్రహ్మోత్సవం..
చూసి తరిద్దాం

- తిరుమలలో నేడు సప్తవాహనాలపై ఊరేగనున్న శ్రీవారు
- రథసప్తమి వేడుకలకు సర్వం సిద్ధం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం రథసప్తమి పర్వదినానికి టీటీడీ సర్వం సిద్ధం చేసింది. శ్రీవారి ఆలయంతోపాటు అన్నప్రసాదం, నిఘా, భద్రత, ఇంజినీరింగ్, ఉద్యానవన తదితర విభాగాల్లో భారీ ఏర్పాట్లు చేపట్టింది. సప్త వాహనాలపై స్వామివారి వైభవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయనుండడంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు పూర్తిచేసింది. శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామున కైంకర్యాలు పూర్తయిన అనంతరం ఉదయం 4.30 గంటలకు శ్రీమలయప్ప స్వామి వారు ఆలయం నుంచి వాహన మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ విశేష సమర్పణ చేపడతారు.

సూర్యప్రభ వాహనం
ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనసేవ మొదలవుతుంది ఆలయ వాయువ్య దిశకు చేరుకోగానే సూర్యోదయాన భానుడి తొలి కిరణాలు శ్రీ మలయప్పస్వామివారి పాదాలను స్పర్శిస్తాయి. ఈ ఘట్టం భక్తులకు కనువిందు చేస్తుంది.

చిన్నశేషవాహనం
ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈ వాహన సేవ మొదలవుతుంది. పురాణ ప్రాశస్త్యం ప్రకారం చిన్నశేషుడిని వాసుకిగా భావిస్తారు.

గరుడ వాహనం
ఉదయం 11 నుంచి 12 గంటల వరకు గరుడ వాహన సేవ నిర్వహించనున్నారు. ఇది శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైనది. ఈ సేవలో తరిస్తే సర్వపాపవిముక్తి కలుగుతుందని ప్రతీతి.

హనుమంత వాహనం
మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు హనుమంత వాహన సేవ ఉంటుంది. శేషాచలాధీశుడు రాముని అవతారంలో తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తాడు.

చక్రస్నానం
చక్రస్నానం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు శ్రీవరాహస్వామివారి ఆలయం వద్ద ఉన్న స్వామిపుష్కరిణిలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేస్తారు.

కల్పవృక్ష వాహనం
సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉభయ దేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై స్వామి వారు మాడ వీధుల్లో విహరించనున్నారు.

సర్వభూపాల వాహనం
సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ వాహన సేవ ఉంటుంది. సర్వభూపాల అంటే విశ్వానికే రాజు అని అర్థం. అంటే శ్రీవారు సకల దిక్పాలకులకు రాజాధిరాజని భావం.

చంద్ర ప్రభ వాహనం
ఈ వాహన సేవ రాత్రి 8 నుంచి 9 గంటల వరకు ఉంటుంది. చంద్రుడు శివునికి శిరోభూషణమైతే ఇక్కడ శ్రీహరికి వాహనంగా ఉండటం విశేషం.

650 మంది పోలీసులతో భద్రత



తిరుపతి (అలిపిరి): భక్తుల భద్రతే పోలీసుల ప్రధాన కర్తవ్యమని ఎస్పీ మల్లికా గార్గ్ సూచించారు. స్థానిక ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఆమె గురువారం పోలీసులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రథసప్తమి సందర్భంగా శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొత్తం 650 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. క్రమశిక్షణతో దురుసుగా లేకుండా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం ఎస్పీ శ్రీవారి వాహన మండపం, మాడ వీధులు, పుష్కరిణి, గ్యాలరీలు, ఎంట్రీ ఎగ్జిట్ గేట్లు, పార్కింగ్ ఏరియాలు, ఇన్నర్ అవుటర్ రింగ్ రోడ్లను పరిశీలించారు.

ముస్తాబైన తుమ్మలగుంట



రథసప్తమి వేడుకల్లో భాగంగా విద్యుత్ దీపాలంకరణలో తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకన్న ఆలయం

- ఏడు వాహనాలపై ఊరేగనున్న కల్యాణ వెంకన్న
- చక్రస్నానానికి సిద్ధమైన పుష్కరిణి
- ప్రత్యేక పుష్పాలంకరణతో స్వామి వారి దర్శనం



స్వామి వారి వాహనాలను సిద్ధం చేస్తున్న ఆలయ సిబ్బంది

తిరుపతి రూరల్ : ఒక రోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమి వేడుకలకు తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయం ముస్తాబవుతోంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో తుమ్మలగుంటలో ఈ నెల 16వ తేదీ శుక్రవారం రథ సప్తమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. ఏడు వాహనాలపై విహరించే స్వామి వారి రథసప్తమి వేడుకలను మినీ బ్రహ్మోత్సవాలుగా పిలవడం పరిపాటి. సూర్య జయంతి పర్వదినాన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు సప్త వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు. ఇప్పటికే ఆలయంతోపాటు పుష్కరిణి పరిసరాలను శుభ్రం చేసిన ఆలయ సిబ్బంది ప్రత్యేక పుష్పాలతో గర్భాలయాన్ని ముస్తాబు చేశారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచే వాహన సేవలు ప్రారంభం అవుతుండడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు అన్నీ పూర్తి చేశారు.

వాహనసేవలు ఇలా
ఈనెల 16వ తేదీ శుక్రవారం ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు సూర్యప్రభ వాహనం, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం, 11 నుంచి 12 గంటల వరకు గరుడ వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు హనుమంత వాహనం, మధ్యాహ్నం 2 గంటలపైన చక్రస్నానం, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్పవృక్ష వాహనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహనంపై స్వామి వారు ఊరేగుతారు.

ఇలా సప్త వాహనాలపై ఒక్క రోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమి వేడుకలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రానుండడంతో అందుకు తగిన విధంగా భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు.

మైనారిటీల పక్షపాతి సీఎం జగన్



షాదీమహల్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రి రోజా, శాసనమండలి డిప్యూటీ ౖచెర్‌పర్సన్

- జగనన్న పాలనలోనే మైనారిటీలకు న్యాయం
- పుత్తూరులో రూ.1.85 కోట్లతో అద్భుతంగా షాదీమహల్ నిర్మాణం
- మంత్రి రోజా, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా



సభకు హాజరైన ముస్లింలు

పుత్తూరు: రాష్ట్రంలోనే కాదు దేశంలోనే మైనారిటీల పక్షపాతి ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని పర్యాటక, సాంస్కృతిక యువజన క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా స్పష్టం చేశారు. గురువారం స్థానిక మసీదు ఆవరణలో రూ.1.85 కోట్లతో నిర్మించిన షాదీమహల్‌ను మంత్రి రోజాతో పాటు డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్‌బాషాతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న ఆశీస్సులతో, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా సహకారంతోనే పుత్తూరులో షాదీమహల్ నిర్మాణం సాధ్యమైందన్నారు. మరో రూ.56 లక్షల తుడా నిధులతో మరింత అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ×నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు¥ అంటూ గర్వంగా పిలిచే ఏకైక సీఎం జగనన్న మాత్రమేనన్నారు. గత చంద్రబాబు పాలనలో ముస్లింలకు ఏమి జరిగింది ? నేటి జగనన్న పాలనలో ఎంత మంచి జరిగిందో ప్రతి ముస్లిం కుటుంబం సరిచూసుకోవాలని కోరారు. అంజాద్ బాషాను ఉప ముఖ్యమంత్రిగా, జకియాఖానంను శాసన మండలి డిప్యూటీ ౖచెర్మన్‌గా చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలకు రూ.80 వేలు ఆర్థిక సాయం అందిస్తున్న ఏకైక సీఎం జగనన్న అన్నారు. ఇమామ్‌లకు అందించే రూ.5 వేల సాయాన్ని రూ.10 వేలు చేసిన ఘనత కూడా ఆయనదే అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏడుగురు మైనారిటీలకు సీట్లు కేటాయించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు.

పట్టుదలకు పెట్టింది పేరు రోజమ్మ..
మంత్రి రోజమ్మ పట్టుదలకు పెట్టింది పేరని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా కొనియాడారు. పుత్తూరులో షాదీమహల్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాల్సిందేనని పట్టుబట్టి సాధించుకున్నారని కొనియాడారు. పుత్తూరులో షాదీమహల్‌తో పాటు, నగరి నియోజకవర్గంలోని మసీదుల అభివృద్ధికి మరో రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ ౖచెర్మన్ జకియాఖానం, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, మున్సిపల్ ౖచెర్మన్ హరి, వైస్ ౖచెర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంపీపీలు మునివేలు, దీప, ముస్లింలు పాల్గొన్నారు.

పర్యాటక క్షేత్రంగా బోయకొండకు గుర్తింపు

- బోయకొండ వనం ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి
- రూ.3 కోట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో వనం నిర్మాణం
- పుంగనూరులో సోలార్ విద్యుత్ ప్రాజెక్టు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రం, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి



బోయకొండ వనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప

చౌడేపల్లె: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న బోయకొండ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేసి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవడమే లక్ష్యమని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం బోయకొండ గంగాపురంలో అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.3 కోట్ల వ్యయంతో సుమారు 11 హెక్టార్లలో ఏర్పాటు చేసిన బోయకొండ వనాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్పతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో బోయకొండలో ముప్పై ఏళ్లలో చేయాల్సిన అభివృద్ధిని ఈ నాలుగున్నరేళ్లలో చేశామన్నారు. గత పాలకులకు బోయకొండను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. బోయకొండ గంగాపురంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకునేలా వనం నిర్మాణం చేపట్టామన్నారు. అలాగే పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రీడా పార్కును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ప్రారంభించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి స్థానిక నేతలతో కలిసి మొక్కలు నాటారు.

అమ్మవారి ప్రసాదాల అందజేత..
బోయకొండ గంగమ్మ అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆలయ కమిటీ ౖచెర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి అందజేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ చైతన్యకుమార్ రెడ్డి, ఎఫ్‌ఆర్వో బాలకృష్ణారెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు జింకా వెంకటా చలపతి, ఎంపీపీ రామ్మూర్తి, మండల కన్వీనర్ అంజిబాబు, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, పాలక మండలి సభ్యులు రాజేష్, పవన్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



పుంగనూరు : ఆరడిగుంట సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అభివృద్ధిని చూపి ఓట్లు అడుగుతున్నాం
పుంగనూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేసి, అలాగే చేసిన అభివృద్ధిని చూపి ఓట్లు అడిగేందుకు ప్రజల్లోకి ధైర్యంగా వెళ్తున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన మున్సిపాలిటీలో రూ.5.90 కోట్లతో నిర్మించిన సోలార్ విద్యుత్ ప్రాజెక్టును, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రం, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోలార్ ప్లాంటును నెలరోజుల వ్యవధిలో యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేశామన్నారు. తద్వారా వెలువడుతున్న విద్యుత్‌ను వినియోగించడం వల్ల ఏటా పుంగనూరు మున్సిపాలిటీకి రూ.1.20 కోట్ల వరకు నిధులు ఆదా అవుతాయన్నారు. పడమటి ప్రాంతాల్లో గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే బయట ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఆ కష్టాలను అధిగమించడానికే రూ.1.47 కోట్లతో మరమ్మతుల కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్, పీకేఎం ఉడా ౖచెర్మన్ వెంకటరెడ్డి యాదవ్, రాష్ట్ర జానపదకళల సంస్థ ౖచెర్మన్ కొండవీటి నాగభూషణం, జిల్లా వక్ఫ్ బోర్డు ౖచెర్మన్ అమ్ము, మండల సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చెంగారెడ్డి, మున్సిపల్ ౖచెర్మన్ అలీమ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ కుటిల యత్నాలు

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఓటర్లకు తాయిలాలా..!
- పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్



తవణంపల్లె: మాట్లాడుతున్న పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్

తవణంపల్లె: వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ కుటిల యత్నాలు సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ మండిపడ్డారు. గురువారం తవణంపల్లెలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందించిన నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని వివరించారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారిపోయాయని, గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిని చూసి టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు అభివృద్ధి గురించి మాట్లాడే ధైర్యం టీడీపీ నాయకులకు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌కు ఉందా అని నిలదీశారు. టీడీపీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఓటర్లకు డబ్బులు, కుక్కర్లు ఇచ్చి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, అందుకు తెల్లగుండ్లపల్లెలో టీడీపీ నాయకులు గోడౌన్‌లో నిల్వ ఉంచిన కుక్కర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటనే నిదర్శనమన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తామన్నారు. ఇకనైనా ఇలాంటి అప్రజాస్వామిక కార్యకలాపాలకు స్వస్తి చెప్పి, ధైర్యంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో గెలవడానికి కృషి చేయాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హరిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, నాయకులు గాంధీబాబు, రమణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, మధుకుమార్, రవిరెడ్డి, ప్రకాష్‌బాబు రెడ్డి, జనార్దన్, రంజిత్‌రెడ్డి, సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

వి.కోట: లారీ ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. వి.కోట–కుప్పం జాతీయ రహదారిలోని గందారమాకులపల్లి వద్ద అదే గ్రామానికి చెందిన నారాయణప్ప(60) రోడ్డు దాటుతుండగా కుప్పం నుంచి వి.కోట వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నారాయణప్పను స్థానికులు 108 వాహనం ద్వారా కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ లింగప్ప తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా జగనన్న పాలన


గుడుపల్లె: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్


చిత్తూరు నగరంలో విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలు

- టీడీపీని వీడి గుడుపల్లె, చిత్తూరులో వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

గుడుపల్లె: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఇతర పార్టీల నుంచి భారీగా చేరుతున్నారు. గురువారం గుడుపల్లె మండలంలోని యామగానిపల్లెకు చెందిన టీడీపీ సానుభూతి పరులు 30 కుటుంబాలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ముందుగా ఆయన గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా టీడీపీలో కొనసాగుతున్న తాము జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలు, అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. వలంటీర్లు ఇంటికే వచ్చి పథకాలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. రాష్ట్రంలో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారన్నారు. కుప్పంలో వైఎస్సార్‌సీపీ గెలుపు జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. 35 ఏళ్లుగా చంద్రబాబును గెలిపిస్తే, సీఎంగా ఉన్న సమయంలో కూడా ఆయన కుప్పం నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేయలేదన్నారు. ఒక్కసారి అవకాశం కల్పిస్తే కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ఆయన శ్రీద్రౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయ నిర్మాణపు పనులను, ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న గోపురం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చిత్తూరులో..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని 24వ డివిజన్ నుంచి పలువురు టీడీపీ మహిళా నాయకులు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కళ, ఇతర మహిళలు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పూమణి, నాయకులు అన్బు తదితరులు పాల్గొన్నారు.

గంట వ్యవధిలో తల్లిదండ్రుల చెంతకు..

పలమనేరు: ఇంటి ముందు ఆడుకుంటూ బజారు వీధిలోకి వెళ్లి తిరిగొచ్చేందుకు దారి తెలియక తప్పిపోయిన ఇద్దరు పిల్లలను స్థానిక పోలీసులు గంట వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన గురువారం పలమనేరులో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. పట్టణంలోని బజారువీధిలో మూడు, నాలుగేళ్ల ఇద్దరు పిల్లలు ఏడుస్తూ కనిపించడంతో పోలీసులు గమనించి వారిని పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. వీరి ఫోటోలను స్థానిక సోషల్ మీడియా గ్రూపులో షేర్ చేశారు. అప్పటికే తమ పిల్లలు తప్పిపోయారని అయ్యాకన్ను వీధికి చెందిన మురళి, శశికళ దంపతులు వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలు స్టేషన్‌లో ఉన్నారని తెలిసి అక్కడికి వచ్చి పిల్లలను తీసుకున్నారు. తమ బిడ్డలను సురక్షితంగా తమ చెంతకు చేర్చినందుకు ఆ దంపతులు సీఐ చంద్రశేఖర్, సిబ్బందికి కృతజ్ఞతలను తెలిపారు. ఇంటి ముందు పిల్లలను పట్టించుకోకుండా వదిలేయడం సరికాదని, జాగ్రత్తగా ఉండాలని వారిని సీఐ హెచ్చరించారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి


మాట్లాడుతున్న సచివాలయ ఉద్యోగి శశికుమార్

శ్రీరంగారాజపురం : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శశికుమార్‌పై దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు ఇంజినీరింగ్ అసిస్టెంట్ శశికుమార్ మాట్లాడుతూ గత మంగళవారం సాయంత్రం విధులు నిర్వహిస్తుండగా పాతపాలెం గ్రామానికి చెందిన చిన్నబ్బకు ఇప్పటికే మూడు పర్యాయాలు ఇంటి బిల్లులు పడ్డాయని తెలిపాడు. అయితే ఆ ఇంటికి సంబంధించి ప్లాస్టింగ్ బిల్లు పెట్టడం జరిగిందని, అది కూడా త్వరలో బిల్లు మంజూరు అవుతుందని ఎంత చెప్పినా వినలేదన్నారు. అతని సమీప బంధువులైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పిచ్చయ్య, మునిరత్నం అందరూ చూస్తుండగా సచివాలయంలోకి వచ్చి దాడి చేశారని వాపోయాడు. సంబంధిత విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. పోలీసులు కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో బాధితుడు ఉన్నతాధికారులను సంప్రదించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీకి పది టన్నుల కూరగాయల వితరణ

పలమనేరు: పట్టణంలోని శ్రీవారి భక్తుల ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం హోసూరు మార్కెట్‌కు చెందిన రంగనాథ బృందం టీటీడీ రథసప్తమి వేడుకల సందర్భంగా అన్నదానసత్రానికి సేకరించిన పది టన్నుల కూరగాయలు, రెండు టన్నుల కొత్తిమీర, కరివేపాకును టీటీడీ ప్రత్యేక వాహనంలో గురువారం తిరుమలకు తరలించారు.కార్యక్రమంలో కాప్పల్లి రవీంద్రారెడ్డి, సోమశేఖర్, బాలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిత్తూరులో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఎంఎస్ఆర్ కూడలి వద్ద గురువారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఎంఎస్ఆర్ కూడలి వద్ద ఉన్న మీసేవ కేంద్రం పక్కనే మరుగుదొడ్లు ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరో అగ్గిపుల్ల వేయడంతో అది పెద్ద మంటకు దారి తీసినట్లు తెలిసింది. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోగా.. ఎలాంటి నష్టం కూడా వాటిల్లో లేదని అధికారులు పేర్కొన్నారు.

వలంటీర్లకు సేవా అవార్డుల ప్రదానం

– విలేకరులతో కలెక్టర్ షణ్మోహన్


మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అంకిత భావంతో విధులు నిర్వహించిన వలంటీర్లకు వరుసగా నాలుగో ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అవార్డులను ప్రదానం చేస్తోందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లకు ఏటా లాగే ఈ ఏడాది కూడా అవార్డులు అందజేస్తామన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని ప్రజాప్రతినిధుల సమక్షంలో అవార్డులను ప్రదానం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

రూ.13.63 కోట్లు ఖర్చు..

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నిర్వహిస్తున్న వలంటీర్ల అభినందన కార్యక్రమానికి రూ.13.63 కోట్లు ఖర్చు చేస్తోందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డుల పేరిట నగదు పురస్కారాలు అందజేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సేవావజ్రలో ఎంపికైన 32 మందికి రూ.14.40 లక్షలు, సేవారత్నలో ఎంపికైన 182 మందికి రూ.54.60 లక్షలు, సేవామిత్రలో ఎంపికైన 8629 మందికి రూ.12.94 కోట్లు మొత్తం 8843 మందికి గానూ రూ.13.63 కోట్లు నేరుగా వలంటీర్ల ఖాతాకు జమ చేయడం జరిగిందని తెలిపారు. ఆ నగదుతోపాటు ప్రతి ఒక్కరికి ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమం ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు చెప్పారు. సేవావజ్రకు ఎంపికైన వారికి రూ.30 వేలు నుంచి రూ.45 వేలు, సేవారత్నకు రూ.20 వేలు నుంచి రూ.30 వేలు, సేవామిత్రకు రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు ప్రభుత్వం పెంచిందన్నారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇదే స్ఫూర్తితో వలంటీర్లు ప్రజలకు చేరువ చేసేలా పనిచేయాలని సూచించారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

- రూ.2 లక్షల విలువ గల కర్ణాటక మద్యంతో పాటు ఆటో సీజ్
- వివరాలు వెల్లడించిన సీఐ కృష్ణమోహన్


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ కృష్ణమోహన్

పెద్దపంజాణి: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.2 లక్షలు విలువ గల మద్యం, ఆటోను పోలీసులు పట్టుకున్నారు. పెద్దపంజాణి పోలీస్‌స్టేషన్‌లో గురువారం గంగవరం రూరల్ సీఐ కృష్ణమోహన్ వివరాలను మీడియాకు వెల్లడించారు. మండల సరిహద్దులోని రాజుపల్లి చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలసి గురువారం ఉదయం తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో కర్ణాటక రాష్ట్రం హెబ్బని వైపు నుంచి వచ్చిన ఓ ఆటోను తనిఖీ చేశారు. ఇందులో మండలంలోని సంపల్లికి చెందిన సద్దాం హుస్సేన్, మంజునాథ్, జగదీష్ కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని, ఆటోలోని 23 బాక్సుల్లో ఉన్న 2208 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు, ఆటోను సీజ్ చేశామన్నారు. నిందితులను విచారించగా సద్దాం హుస్సేన్ ఒక ముఠాను ఏర్పాటు చేసుకుని కర్ణాటక మద్యానికి మంచి గిరాకి ఉన్నందున హెబ్బనిలో ఉన్న వైన్ షాపులో అక్రమంగా మద్యాన్ని కొని కర్ణాటక సరిహద్దులో డంప్ చేసుకునేవాడు. అక్కడ నుంచి తన అనుచరుల ద్వారా మద్యం బాక్సులను వాహనాలలో నింపుకుని పైలెట్‌గా అనుచరులలో ఒకరిని నియమించుకుని పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు, సోమల, పుంగనూరు, చౌడేపల్లి మండలాలకు తరలిస్తున్నట్లు తమ విచారణలో తేలిందని సీఐ తెలిపారు. ముఠా నాయకుడైన సద్దాం హుస్సేన్‌పై పెద్దపంజాణి పోలీస్టేషన్‌లో మూడు కేసులు, పుంగనూరు సెబ్ పోలీస్టేషన్‌లో నాలుగు కేసులు ఉన్నట్లు చెప్పారు. ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, ఇందులో ప్రమేయం ఉన్న మరికొందరిని కూడా అరెస్టు చేస్తామన్నారు. పెద్దపంజాణి ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని చిత్తూరు ఎస్పీ, పలమనేరు డీఎస్పీ అభినందించారు.

వాహన తనిఖీలు చేస్తుండగా..

చిత్తూరు అర్బన్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసి ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. సీఐ ఉలసయ్య తెలిపిన వివరాల మేరకు.. ఇరువారం జంక్షన్‌లో తమ సిబ్బంది గురువారం తనిఖీలు చేపట్టామన్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన కారు తనిఖీ చేయగా అందులో రూ.30 వేలు విలువ చేసే కర్ణాటక మద్యం పట్టుబడిందన్నారు. మద్యంతో పాటు రూ.4 లక్షలు విలువ చేసే కారును, అక్రమంగా మద్యం తరలిస్తున్న తమిళనాడుకు చెందిన జగదీష్ (33)ను అరెస్ట్ చేశామన్నారు. చిత్తూరుకు చెందిన పాండ్యా, లడ్డు, చంద్రులు పరారీలో ఉన్నట్లు సీఐ వివరించారు. త్వరలో వారిని కూడా అరెస్ట్ చేస్తామని తెలిపారు.

వెలవెలబోయిన టీడీపీ బీసీ గళం


జనం లేని టీడీపీ బీసీ గళంలో ఇన్‌చార్జ్ థామస్

కార్వేటినగరం: రాత్రికి రాత్రే వీధులన్నీ పసుపు జెండాలతో నింపిన తెలుగు తమ్ముళ్లకు బీసీలు షాక్ ఇచ్చారు. గురువారం మండల కేంద్రంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ థామస్ ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు బీసీ గళం ర్యాలీ నిర్వహించారు. అయితే ఈ ర్యాలీకి బీసీలు మొహం చాటేయడంతో టీడీపీ నేతలు ఖంగుతిన్నారు. మండలంలో అత్యధికంగా ఉన్న యాదవు కులస్తులు కూడా బీసీ గళానికి హాజరు కాకపోవడంతో వారికి నిరాశే మిగిలింది. అరకొర జనం రావడంతో టీడీపీ నేతల ఊదరగొట్టే మాటలకు స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. జనం లేకపోయినా హంగామా ఎక్కువైందనే విమర్శలు వినిపించాయి.

ఐపీ పెట్టిన డబ్బు చెల్లించాలని ఒత్తిడి

పెనుమూరు(కార్వేటినగరం): మండల కేంద్రానికి చెందిన పాండురంగశెట్టి రూ.85 కోట్లకు రెండున్నరేళ్ల క్రితం ఐపీ దాఖలు చేసి పరారయ్యాడు. అప్పటి నుంచి అతని తాలూకు బంధువుల కోసం ఆరాతీస్తున్న రుణదాతలు పాండురంగశెట్టి మనువడు ప్రవీణ్ తిరుపతిలో ఉన్నాడని తెలుసుకున్నారు. ఈ మేరకు గురువారం అతన్ని పెనుమూరుకు తీసుకువచ్చి అప్పులు తీర్చాలని ఒత్తిడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఈ విషయం ఇప్పటికే కోర్టు పరిధిలో ఉందని, ఇలాంటి వాటిపై కేసు నమోదు చేయకూడదని చెప్పారు. పాండురంగశెట్టి మనువడు ప్రవీణ్ మాట్లాడుతూ బెంగళూరు, పెనుమూరులో ఉన్న తమ ఆస్తులను అమ్మి ఆరు నెలల్లోపు బాధితుల రుణాలు తీర్చుతామని చెప్పారు.

గిరిజన గురుకుల పాఠశాలల్లో దరఖాస్తుల ఆహ్వానం

రేణిగుంట: ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ శాఖ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ గిరిజన గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని నెల్లూరు ఐటీడీఏ పీవో మందారాణి గురువారం తెలిపారు. రేణిగుంట, కేవీపల్లి, గిరిజన గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి, 6 నుంచి 9 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఖాళీలను పరిశీలిస్తే రేణిగుంట స్కూల్లో ఐదో తరగతికి మొత్తం 80 సీట్లు ఉండగా, అందులో ఎస్టీ 59, ఎస్టీ (పీహెచ్‌సీ) -01, పీటీజీ-01, ఓసీ-02, ఎస్సీ-10, బీసీ-04, ఏఈక్యూ- 02 సీట్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు. అలాగే 6వ తరగతిలో 39, 7వ తరగతిలో 08, 8వ తరగతిలో 03, 9వ తరగతిలో 12 సీట్లు ఖాళీలున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు మొత్తం 80 సీట్లుండగా, వాటిలో ఎస్టీ 59, ఎస్టీ (పీహెచ్‌సీ) -01, పీటీజీ-01, ఓసీ-02, ఎస్సీ-10, బీసీ-04, ఏఈక్యూ- 02 సీట్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు. 6వ తరగతి- 10, 7వ తరగతి- 00, 8వ తరగతి -00, 9వ తరగతి- 06 సీట్లు ఖాళీలున్నాయన్నారు. కేవీ పల్లి స్కూల్లో 5వ తరగతి ప్రవేశాలకు మొత్తం 80 సీట్లుండగా, వాటిలో ఎస్టీ 59, ఎస్టీ (పీహెచ్‌సీ) -01, పీటీజీ-01, ఓసీ-02, ఎస్సీ-10, బీసీ-04, ఏఈక్యూ- 02 సీట్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు. అలాగే 6వ తరగతిలో 64, 7వ తరగతిలో 46, 8వ తరగతిలో 45, 9వ తరగతిలో 49 సీట్లు ఖాళీలున్నాయన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు దరఖాస్తులను www.aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్ నందు సమర్పించాలన్నారు. ఏప్రిల్ 21వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. ఇతర వివరాలకు జిల్లా గిరిజన సంక్షేమాధికారి(94926 06731), రేణిగుంట స్కూల్ ప్రిన్సిపల్ (94410 40199), శ్రీకాళహస్తి ప్రిన్సిపల్(98666 62515), కెవి పల్లి ప్రిన్సిపల్ (94909 80563) నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.